IMMANUEL BIBLE COLLEGE

CHRISTIANPET NIDUBROLU

# గొప్ప వేదాంతము

## (ప్రసంగి గ్రంథం సంగ్రహ సమీక్ష)

**A. ఉపోద్ఘాతము :** దేవుని పిల్లలు, తమను కలవరపరచే, దిక్కుతోచని జీవిత సమస్యలకు జవాబు కనుగొనాలంటే ప్రసంగి గ్రంథాన్ని తప్పకుండా చదవాల్సిందే. ప్రసంగి గ్రంథం వారి హృదయాలతో మాట్లాడుతుంది. అనుభవం మనల్ని చక్కగా నడిపించేందుకు ఓ అధ్యాపకునిగా ఉపయోగపడినా, అనుభవం ఒక్కటే మన జీవితానికి అధ్యాపకునిగా ఉండలేదని ఈ గ్రంథం నిరూపిస్తుంది. జీవితం అంటే ఏమిటి? అనే ప్రశ్నకు ప్రసంగి గ్రంథంలో దైవజ్ఞానానుసారంగా, వాక్యాధారాలతో జవాబు ఇవ్వబడింది.

**1. గ్రంథకర్త :** ఈ గ్రంథకర్త అనుభవాలను బట్టి (1:1-2) దీనిని సొలొమోను వ్రాసాడని చెప్తారు. ఈ గ్రంథంలో సొలొమోను "కొహెలెత్" అనే హెబ్రీ పదంతో పరిచయం అవుతున్నాడు. ఈ పేరు సెప్టువజెంట్ నుండి తీసికోబడింది. కొహెలెత్ అనే మాటకు 'బోధకుడు' లేక 'ఒక సమాజాన్ని ఉద్దేశించి మాట్లాడేవాడు' అని అర్థం.

**2. గ్రంథ రచన కాలం :** క్రీ॥పూ॥ 935 సంవత్సరంలో అనగా, సొలొమోను జీవిత చరమాంకములో ప్రసంగి గ్రంథం వ్రాయబడిందని చరిత్రకారుల అభిప్రాయం. సొలొమోను యౌవన దశలో పరమగీతాలు, మధ్య వయస్కుడుగా ఉన్నప్పుడు సామెతల గ్రంథాన్ని, వృద్ధాప్యంలో ప్రసంగి గ్రంథాన్ని వ్రాసాడని నమ్ముతారు.

**3. సందర్భం :** ఓ తత్త్వవేత్తగా, జీవిత సమస్యలను గూర్చి సొలొమోను మనస్సులో గల తర్కవితర్కాలు, అతని గత జీవితం మరియు అనుభవాలు ఈ గ్రంథంలో వ్రాయబడ్డాయి. అతనికున్న అపోహలన్నీ తొలగిపోయాక అతడు, ఎపిక్యూరియన్‌ల భౌతికవాదానికి సంబంధించిన తత్వాన్ని వెల్లడించాడు. అదేమనగా, జీవితంలో సుఖంగా ఉండడంకన్న ముఖ్యమైంది మరోటి లేదు. ఈ తలంపే పుస్తకమంతటా కనిపిస్తుంది.

**4. సందేశం :** తన బాల్యం నుండి వృద్ధాప్యం వరకు, భూమ్మీద జరుగుతున్న ప్రతి కార్యాన్ని కన్నులారా చూసిన సొలొమోను సమస్తము వ్యర్థము అనే సందేశాన్ని ఇచ్చాడు. అందరూ విలువైనవిగా భావించే వాటిలో ఎంత శూన్యత, వ్యర్థత ఉన్నాయో జ్ఞానయుక్తంగా తెలియజేసాడు.

మానవ జీవితాన్ని గూర్చిన ఏ తత్త్వశాస్త్రమైనా వ్యర్థం అని తెలియజేసేందుకు, జీవిత అర్థం మరియు లక్ష్యాన్ని గూర్చి మానవునికున్న తలంపులు, మతం యొక్క పరిశోధనలను గూర్చి ఈ గ్రంథంలో వ్రాయబడింది. వీటికి సంబంధించి మానవుని తర్కాలు ఇందులో నమోదు చేయబడ్డాయి. ప్రసంగి గ్రంథాన్నంతా రెండు మాటలతో క్రోడీకరించవచ్చు.

అ) క్లారెన్స్‌డర్రో అనే అసంబద్ధవాది అభిప్రాయం : "నా జీవితాన్నంతా క్రోడీకరించి చెప్పేమాట బైబిలులో లూకా 5:5లో ఉంది. అదేమనగా "రాత్రంతయు ప్రయాసపడ్డాము, కాని మాకు ఏమి దొరకలేదు".

ఆ) కుక్ అనే త్రవ్వకం పని చేసే కూలీ వాని అభిప్రాయం – "నేను త్రవ్వడానికి తగిన శక్తిని పొందేందుకు అవసరమైన ఆహారం కొరకు త్రవ్వకం పని చేస్తున్నాను".

**5. మూలాంశం :** "దేవునియందు భయభక్తులు కలిగియుండి ఆయన కట్టడలననుసరించి నడుచుచుండవలెను, మానవకోటికి ఇదియే విధి" (12:13)

**6. మూలపదాలు :** వ్యర్థం అనేమాట 37 సార్లు, సూర్యుని క్రింద అనేమాట 29 సార్లు, మనిషి అనేమాట 47 సార్లు, కష్టం అనే మాట 36 సార్లు ప్రస్తావించబడింది.

**B. గ్రంథ విశిష్టత :** జీవిత అర్థాన్ని గూర్చి విభిన్న తలంపులతో సతమతమౌతున్న సమయంలో సొలొమోను దేవుని పట్ల మానవుల బాధ్యతలను చక్కగా వివరించాడు. 127వ కీర్తనలో అతడు క్లుప్తంగా వ్రాసిన విషయాలనే ఈ పుస్తకంలో వివరంగా వ్రాసాడు. క్రీస్తులేని హృదయంలో ఎంత ఖాళీ స్థలం ఉంటుందో ఈ గ్రంథం తెలియజేస్తుంది. సర్వలోకాన్ని సంపాదించుకొని ఆ హృదయంలో ఉంచినా అది ఖాళీగానే ఉంటుంది. దాన్ని దేనితోను నింపలేము. సూర్యుని క్రింద ఉన్న మనిషికి క్రీస్తులో ఉన్న వ్యక్తికి మధ్య గొప్ప వ్యత్యాసం ఉంది. క్రీస్తులో ఉన్నవాడు సూర్యునికిపైన, అనగా పరలోకంలో కూర్చుంటాడు. ఏ వయస్సులోనైనా దేవునితో సరైన సంబంధం కలిగి ఆయన నియమించిన మార్గంలో నిలిచి వుంటేనే తృప్తి కలుగుతుంది.

ఈ గ్రంథంలో సొలొమోను ఉపయోగించిన కొన్ని సహజ విషయాలు విజ్ఞాన శాస్త్రపరంగా సరైనవే. 1:6,7లోని తుపాను గూర్చిన వర్ణన రెడ్‌ఫీల్డ్ అనే శాస్త్రజ్ఞుని సిద్ధాంతానికి సరిపోయినదని కొందరి అభిప్రాయం. గాలి వీచే విధానం, మొక్కల ఎదుగుదలను గూర్చిన సూత్రాలు, భూమిపైనున్న నీరు ఆవిరిగా మారి మేఘంగా మారడం, అది తిరిగి భూమిపై వర్షంగా కురవడం, సముద్రపు సరిహద్దులు మొదలైన విషయాలన్నీ సరిగ్గా విజ్ఞాన శాస్త్రానికి సరిపోయే విధంగా సొలొమోను ఎలా వ్రాయగలిగాడో ఆలోచించదగిన విషయం. నిస్సందేహంగా దైవజ్ఞానంతోనే వాటన్నిటిని వ్రాయగలిగాడు.

**C. గ్రంథ విభజన :**

| | |
|---|---|
| **I.** సమస్య వివరణ : సమస్తము వ్యర్థము | (1:1-3) |
| **II.** ప్రయోగము (ప్రయత్నము) చేయుట | (1:4; 12:12) |

**క్రింద పేర్కొనబడిన వాటిలో సంతృప్తిని వెదకుట.**

| | |
|---|---|
| 1. విజ్ఞానశాస్త్రం (ప్రకృతి నియమాలు) | 1:4-11 |
| 2. జ్ఞానము మరియు తత్త్వశాస్త్రము | 1:12-18 |
| 3. సౌఖ్యాలు | 2:1-11 |
| 4. భౌతిక విషయాలు (ప్రస్తుతం కొరకే జీవించుట) | 2:12-26 |
| 5. కర్మ (విధి) సిద్ధాంతం | 3:1-15 |
| 6. అహంభావము | 3:16; 4:16 |
| 7. మతము | 5:1-8 |
| 8. ఐశ్వర్యము | 5:9; 6:12 |
| 9. నైతిక జీవితం | 7:1; 12:12 |
| **III.** ప్రయోగ (ప్రయత్నాల) ఫలితం | (12:13, 14) |

**D. అంశాలవారిగా సంక్షిప్త వివరణ :**

**I. అన్వేషణ :** ఒకే రీతిగా పునరావృతం అవుతున్న మానవ జీవితం యొక్క అర్థాన్ని అన్వేషించిన సొలొమోనుకు ఈ లోకంలోనివన్నీ వర్థ్యంగానే కనిపించాయి. ఈ అన్వేషణను ఆరంభించక ముందే సొలొమోను మనస్సులో అనేక సందేహాలున్నాయి. దైవ జ్ఞానాన్ని పొందిన సొలొమోను ఉద్దేశంలో ప్రతి ఒక్కటి ఓటమిగానే కనిపించింది (1:2) తరాలు గతిస్తున్నాయి గాని ఏ వ్యత్యాసం కనిపించదు (1:4). ఎంత వెదకినా క్రొత్తదనమేమి కనిపించదు. మనిషికి తృప్తి కలుగడం లేదు. జీవితంలో అన్నిటిని రుచి చూచి అనుభవించిన సొలొమోను, సూర్యుని క్రింద జరిగే ప్రతి కార్యము వ్యర్థము అని ఒక్క మాటలో తేల్చిచెప్పేసాడు, మానవుడు తన పరిమిత జ్ఞానంతో జీవనోపాధి నిమిత్తం ఎన్నోపాట్లు పడుతున్నాడు. దేవుని సృష్టిలో ప్రకృతి నియమాలే క్రమబద్ధంగా జరుగుతున్నాయి. కాని ఎవరైనా, ఏదైనా నూతనమైనది అని చెప్పితే, అది కూడ పాతదేనని, వ్యర్థమైనదే అని సొలొమోను మాటల భావం. సంతృప్తి మరియు సంతోషం కోసం సహజమానవుని అన్వేషణ, ప్రయాస ఈ భాగంలో కనిపిస్తుంది.

1. **విజ్ఞానశాస్త్రంలో తృప్తిని అన్వేషించుట (1:4-11) :** ఈ భూమి శాశ్వతమైనది, మనిషి అశాశ్వతుడు. పుట్టుకల ద్వారా మానవజాతి కొనసాగించబడుతూ ఉంటుంది (1:4) పదార్థ సంబంధమైన ప్రపంచం ఎలా స్థిరమైనదో ప్రకృతి నియమాలు కూడ అంతే స్థిరమైనవి (1:5-7). ఈ భాగంలో ఆలాంటి వైజ్ఞానిక విషయాలు కొన్ని పేర్కొనబడ్డాయి. ఈ ప్రపంచాన్ని గూర్చిన అన్వేషణలో మనిషి విసిగిపోడు లేక నేను తెలిసికొన్నది ఇక చాలు అని విరమించడు (1:8). ఎందుచేత నంటే ఎంత తెలిసికొన్నా ఇంకా తెలిసికోవలసినవెన్నో ఉన్నాయి. అదే మనిషిని విశ్రమింపనియ్యదు. ఈ భౌతిక ప్రపంచం అల్పమైన (సూక్ష్మమైన) మనిషి తెలిసికోలేనంత పెద్దది. అనేక ఆధునిక సాధనాలున్న ఈ యుగంలో సూర్యుని క్రింద క్రొత్తది ఏమి లేదు అన్న మాట అసత్యం అనిపిస్తుంది. కాని అది వాస్తవం (1:9-11). అణుబాంబు క్రొత్తదే అయినా వాస్తవానికి అణువును గూర్చి మనిషికి చాలాకాలం నుండి తెలియదు కాని, అది మనిషి కంటె పురాతనమైనది. దాని గురించి ప్రయోగాలు చేసి మనిషి అణుశక్తిని తనకు ప్రమాదకరమైన శత్రువుగా చేసికోవడం తప్ప సాధించినదేమి లేదు. కంప్యూటర్‌లాంటి మెదడు, ఎలక్ట్రానిక్ శక్తిలాంటి నాడీమండలం మనిషికి శాశ్వత తృప్తినివ్వలేవు.

2. **జ్ఞానం మరియు తత్త్వశాస్త్రంలో అన్వేషణ (1:12-18) :** సొలొమోను ప్రపంచంలో అందరి కంటె గొప్ప జ్ఞాని. అతనికి ముందుగాని, అతని తరువాత గాని అంత జ్ఞానం గలవారెవరూ లేరు. అయితే అతడు అధిక జ్ఞానం వలన అధిక దుఃఖం, వ్యసనం ఉందని గ్రహించాడు (1:18). దేవుని ప్రత్యక్షతను పొందని మనస్సులో ఏర్పడే తత్త్వం, తర్కం ఈ భాగంలో గోచరమౌతాయి. ఇందులో ఒక విధమైన ఆధ్యాత్మిక అపశృతి, హేతుబద్ధంగా ప్రవర్తింపని, ఆలోచించని మానసిక అస్తవ్యస్తత కనిపిస్తుంది. తత్త్వశాస్త్ర పద్ధతులన్నీ గ్రుడ్డిగా దొడ్డి దారివైపు నడిపిస్తాయి (1:13, 14) తత్త్వశాస్త్రంగాని, మానసిక తత్త్వశాస్త్రం గాని మనిషి స్వభావాన్ని మార్చలేవు. అనగా మనిషి పాత స్వభావాన్ని సరి చెయ్యలేవు (1:15) జ్ఞానం వృద్ధి చెందినంతగా సంతోషం, సంతృప్తి పెరగవు (1:18).

3. **సౌఖ్యాలలో అన్వేషణ (2:1-11) :** ఇశ్రాయేలు సామ్రాజ్యాధి నేతగా సొలొమోను తనకున్న డబ్బు, హోదా, వస్తువాహనాలు, పనివారి ద్వారా సర్వసౌఖ్యాలు అనుభవించిన తరువాత అవన్నీ వ్యర్థమని గ్రహించాడు. తన అన్వేషణలో అతడు సౌఖ్యమే ప్రధానమని శారీరక కోరికలన్నిటిని తీర్చుకోవడమే నైతిక జీవితంలో అనివార్యం అని బోధించే హెడెనిజం అనే వాదాన్ని (అనుసరించాడు) ప్రయోగించి చూసాడు. అయితే అవన్నీ అల్పకాల పాపభోగాలే అని గ్రహించాడు. (హెబ్రీ 11:25) ఈ లోకంలో సౌఖ్యం కోసం మానవుడు పడే ప్రయాస అంతావ్యర్థం. మనిషి పుట్టినప్పుడు ఈ లోకానికి ఏమి తీసికొని రాడు. అయినా తనకోసమే ప్రయాసపడతాడు. దేవుణ్ణి వెదకడంలో అలా ప్రయాసపడితే నిజమైన సంతోషం, విశ్రాంతి దొరుకుతుందని సొలొమోనుకంటె శ్రేష్ఠుడైన యేసు ప్రభువు చెప్పాడు (మత్త 11:28).

4. **భౌతికవాదంలో అన్వేషణ (2:12-26) :** ఈ సిద్ధాంతం ప్రస్తుతం కోసమే జీవించమని చెప్తుంది. ఈ కోణంలో అన్వేషణను కొనసాగించిన సొలొమోనుకు అధిక జ్ఞానం గలవానికి, బుద్ధిహీనునికి మధ్య శాశ్వత వ్యత్యాసం ఏమి కనిపించలేదు (2:12-16). ఇద్దరి అంతము ఒక్కటే (2:17-20). ఒకవేళ అతడు విస్తారమైన ఐశ్వర్యాన్ని, సంపదలను సంపాదించినా వాటిని తన తదనంతరం తనవారసులకు వారు జ్ఞానులైన, అజ్ఞానులైనా వారికి విడిచి వెళతాడు (2:21-23). జ్ఞానము గలవారు సహితం దుఃఖాన్ని, వ్యాధిని, మరణాన్ని తప్పించుకోలేరు (2:24-26). కాబట్టి సంపాదించిన దానితో తిని, త్రాగి జీవితాన్ని సుఖంగా గడపడం మంచిది. నేటి కొరకే జీవించు రేపటిని గూర్చి మర్చిపో అన్నదే ఈ సిద్ధాంతం. ఇది బాగానే ఉన్నా ఇది కూడ సంతృప్తినివ్వదు.

5. **కర్మ (విధి) సిద్ధాంతంలో అన్వేషణ (3:1-15) :** ఈ భాగంలోని మొదటి ఎనిమిది వచనాల నుండి ఏవో క్రైస్తవ సత్యాలను చెప్పేందుకు కొంతమంది ప్రయత్నిస్తారు. కాని ఇది పూర్తిగా అన్య సిద్ధాంతం. ఒకవేళ ఇవే గనుక వాస్తవమైనవైతే మనిషి ఓ మరబొమ్మ లేక కంప్యూటర్ లేక మీట నొక్కితే పనిచేసే యంత్రం కంటె గొప్పవాడేమి కాదన్న మాట. ఈ విధమైన ఆలోచనా విధానంలో మనిషి స్వేచ్ఛకు మరియు దేవుని కృప కనికరాలకు స్థానం ఉండదు. ఈ లోకంలో జరిగే ప్రతి కార్యానికి సమయం ఉంది. ఇక్కడ వ్రాయబడిన పనులు ఒకదానికొకటి వ్యతిరేకమైనవే. అయినా రెండూ అవసరమే. ఏ సమయంలో ఏమి చెయ్యాలో దాన్ని చేయడమే నిజమైన జ్ఞానం. మనిషి ప్రతి పనికి తొందరపడతాడు. పరిస్థితులను ఉన్నది ఉన్నట్లుగా అంగీకరించడు. పైగా తాను మార్చలేని పరిస్థితులను మార్చడానికి ప్రయత్నించి విఫలుడౌతాడు. దేవుని సమయ సూచికను మరచిపోతారు. దానిని ఎవరూ మార్చలేరు (అపొ 1:7). అవసరమైతే దేవుడే మారుస్తాడు (నిర్గ 32:10; యెష 38). మనం తొందరపడినంత మాత్రాన లేక జాప్యం చేసినంత మాత్రాన దేవుడు తన ప్రణాళికలను మార్చుకోడు.

ఈ లోకం మనిషికి తృప్తినివ్వదని గ్రహించేందుకే దేవుడు మనిషి హృదయంలో శాశ్వతకాల జ్ఞానాన్ని ఉంచాడు (3:10,11). ఈ జ్ఞానంతో మరణానంతర జీవితాన్ని గూర్చి ఆలోచిస్తూ, ప్రశ్నించుకొంటూ ఉంటాడు (యోబు 14:14). మనిషిలో తలఎత్తే పారమార్థిక ప్రశ్నలకు ఈ లోకంలోనివేవి జవాబు చెప్పలేవు. ఈ లోకాన్ని ఎంతగా హృదయంలో నింపుకొన్నా ఇంకా వెలితిగానే ఉంటుంది. మనిషి జీవితంలో దేవుని చిత్తమే ప్రధానమైనదైనా, ఈ కర్మ సిద్ధాంతం దేవుని కృపాకనికరాలకు చోటివ్వదు.



6. **అహంభావం ద్వారా అన్వేషణ (3:16; 4:16) :** తనను గూర్చే ఎక్కువగా శ్రద్ధ వహించుట లేక తనను తాను ఎక్కువగా ప్రేమించుకోవడం సహజంగా మానవ స్వార్థపూరిత నైజం. 3:16లో సొలొమోను అందరూ దుష్టులే కాబట్టి ఎవరినీ నమ్మలేము అనే భావాన్ని వ్యక్తం చేస్తున్నాడు. 3:18, 19 లో ప్రసంగి వాదము ఆశావాది నిష్కర్షను అంగీకరించదు. పరిణామ సిద్ధాంతం, మనిషి జంతువులో నుండి వచ్చాడని చెప్తుంది. అహంభావం మనిషి ఓ జంతువు అని చెప్తుంది. ఈ సిద్ధాంతం ఒకరినొకరు కించపరచుకొనేలా చేస్తుంది. అదే లోకంలోని అన్ని దేశాలలో కుల మత వర్గాలను సృష్టించింది. 3:20లో రచయిత శరీరాన్ని గూర్చి మాత్రమే మాట్లాడుతున్నాడు. 21వ వచనంలో మనిషి జంతువుకంటె ప్రత్యేకమైన వానిగా కనిపిస్తున్నాడు. ఏది ఏమైనా మనిషి తాను చేసిన పనులను బట్టి తన గుర్తింపును తెలిసికోవడం ఉత్తమం.

7. **మతములో అన్వేషణ (5:1-8) :** ఈ లోకానికి అన్నిటికంటె ఎక్కువ నష్టాన్ని కలుగజేసింది మతమే. అన్యమతాలు ప్రజలకు ఏమి చేసాయో చరిత్ర వివరిస్తుంది. అలాగే కాథొలిక్ సిద్ధాంతం, స్వేచ్ఛావాదులైన ప్రొటస్టంట్ల చరిత్ర గమనించండి. రెండవ ప్రపంచ యుద్ధం మొదలుకొని సంఘంలో చేరిన అనేకులు మతాన్ని బట్టే దేవునికి దూరమయ్యారు. క్రీస్తుతో వ్యక్తిగత సంబంధాన్ని కోల్పోయారు.

ఈ భాగంలో మతానుసారంగా జీవించినా, మందిరానికి వెళ్ళినా మతవ్యవహారాలలో మితంగా ఉండాలని సొలొమోను చెప్తున్నాడు (5:1). ఒత్తిడి వలనగాని, ఉద్వేగంతో గాని ఏ తీర్మానాన్ని చేసికోవద్దు (5:2). ఇతర చెడు విషయాలను బట్టి ఏడ్వాలిగాని దేవుని సంఘములో కాదు. ఒప్పందాలపై సంతకం చెయ్యవద్దు. పదవులను నిరాకరించాలి. 5:4-6లో మొక్కుబడుల ప్రాధాన్యతను గూర్చి తెలియజేస్తున్నాడు. దేవునితో మన వ్యక్తిగత సంబంధానికి కలలు ప్రత్యామ్నాయాలు కావు (5:7). ప్రతి క్రైస్తవుడు బీదల విషయం శ్రద్ధ వహించాలి.

8. **ఐశ్వర్యంలో అన్వేషణ (5:9; 6:12) :** ఈ భాగంలో ఐశ్వర్యము మనిషికి సంతోషాన్ని, తృప్తిని ఇవ్వదని సొలొమోను స్పష్టం చేస్తున్నాడు. ధనము చెడ్డది కాదు గాని ధనాపేక్ష చెడ్డది (5:10; I తిమో 6:10). ఐశ్వర్యవంతులవడానికే ధనాన్ని సంపాదించడం తప్పు. పిసినారి ధనం బల్లపరుపుగా ఉంది గనుక దాన్ని కూడబెడదామనుకొంటాడు. కాని పొదుపుగా వాడేవారు నాణాలు గుండ్రంగా ఉన్నాయి గనుక అవసరాన్ని బట్టి వాటిని దొర్లించవచ్చుననుకొంటారు. అందుకే ధనవంతుని కన్న పేదవాడే ఎక్కువ సంతోషంగా జీవించగలుగుతాడు (5:12). ధనవంతుడు రోజుకు మూడుసార్లు భోజనం చెయ్యగలడు, రోజు ఒకే పరుపుపై హాయిగా నిద్రపోగలడు గాని పేదవాని కంటె ఎక్కువ కాలం బ్రతకలేడు (6:1-12). ధనవంతుని ప్రేత వస్త్రాలకు జేబులుండవు. అతని జీవితం ఓ నీడలాంటిది.

యోబులాంటి గొప్ప ధనవంతుడే నేను వట్టి చేతులతో ఈ లోకానికి వచ్చాను, వట్టి చేతులతోనే ఈ లోకాన్ని విడిచివెళతానన్నాడు. ఈ లోకంలో సంతోషం కలుగ జేయలేనిది, ఆ తరువాత ఏ విలువ లేని దానిని సంపాదించుకోవడానికి జీవితాన్ని వ్యర్థం చేయడం కన్న ఏమి లేకుండ జీవించడమే మేలు.

**9. నీతి (మంచి జీవితం) ద్వారా అన్వేషణ (7:1; 12:12) :** మంచిని చేసేవాడు జీవిత స్వేచ్ఛా వీధి మధ్య హుందాగా నడుస్తాడు. అతడు పట్టణ ప్రధాన రహదారిలో నియాన్ లైట్ల క్రింద తన వ్యాపారాన్ని చేయవచ్చును గాని మామూలు వీధులలోనే నివసిస్తాడు. అయినా అతడు దాన్ని అంతగా పట్టించుకోడు. మంచి పేరు సంపాదించుకోవడం, మరియు భూస్థాపన సమయంలో సుదీర్ఘమైన పొగడ్తలు జీవితానికి విలువను చేకూర్చవు. 7వ అధ్యాయంలో విందు మొదలుకొని భూస్థాపన కార్యక్రమం వరకు అన్నీ ఘనంగా జరగాలని, మరణం యొక్క సామీప్యంలోనే జీవిస్తూ సమాధి తోట వరకు నవ్వుతూ వెళ్ళాలని నేర్పిస్తుంది. ప్రతి విషయాన్ని తేలిగ్గా తీసికోవాలి. నింపాదిగా జీవించాలి. దేనినే గాని అధికంగా చెయ్యవద్దు. ఏ విషయంలోను రాజీపడవద్దు, పోట్లాడవద్దు. మంచిగా జీవించాలని కోరేవారు వీటిని అనుసరించాలి. 8వ అధ్యాయానికొచ్చేసరికి, సొలొమోను, దుష్టులకు మరియు నీతి మంతులకు మధ్య అంతగా వ్యత్యాసం లేదని కనుగొన్నాడు (8:14, 15). కట్టడలకు లోబడడం, ప్రమాదం రాకుండ జాగ్రత్తపడడం, దుష్కార్యాలలో పాలుపుచ్చుకోకపోవడం మంచిది (8:2-5). మనుష్యులందరూ ఒకే రీతిగా పుట్టకున్నా, ఒకే రీతిగా చస్తారు (8:8). మరణం విషయాకొచ్చేసరికి మానవులందరూ సమానమే. పాపం చేసినపుడు దేవుడు వెంటనే శిక్షించడు అనుకొని మనుష్యులు మోసపోతున్నారు (8:11). కాని వెంటనే శిక్షపొందకున్నా దేవుని శిక్షను తప్పించుకోలేరని గ్రహించరు. మనిషి తప్పు అభిప్రాయాలు, తప్పు తత్త్వశాస్త్రం అన్నీ కూడ అతని అజ్ఞానం నుండి పుట్టినవే. తప్పు సిద్ధాంతాలన్ని జాత్యహంకారం వల్ల ఏర్పడినవేనని 9వ అధ్యాయం తెలియజేస్తుంది. ఈ అధ్యాయంలో సూర్యుని క్రింద అనేమాట 4 సార్లు ప్రస్తావించబడింది. మానవులందరి గతి ఒక్కటే, ఈ విషయంలో అందరూ సమానమేనన్న సంపూర్ణ యథార్థస్థితికి మనిషిని మరణం తీసుకొని వస్తుంది. మనిషి బ్రతికి ఉంటేనే మరో మనిషికి అతనిపై నిరీక్షణ ఉంటుంది (9:4). 9వ అధ్యాయం 5వ వచనంలో సొలొమోను శరీరాన్ని గూర్చే చెప్పాడుగాని ఆత్మను గూర్చి కాదు. 10వ వచనంలో శరీరమును గూర్చిన స్పష్టమైన వివరణ ఉంది. చెయ్యడానికి చేతికి వచ్చిన పనిని ప్రాణముండగానే చెయ్యాలి. సమాధిలోనికి వెళ్ళాక చెయ్యలేము. చెయ్యి శరీరానికి సంబంధించినది, అది నిద్రించేందుకు సమాధిలో పెట్టబడుతుంది గాని ఆత్మ దేవుని యొద్దకు వెళ్తుంది (12:7). జీవితం అన్నది అదృష్టం లేక అవకాశం అనే ఓ ఆటవిడుపులాంటిదని ప్రసంగి చెప్తున్నాడు (9:11,12).

అవినీతి, అన్యాయం జీవిత విలువల్ని తగ్గిస్తుంది. ఏ కొంచెము చెడు అయినా జీవితాన్నంతా పాడుచేస్తుంది (10:1). కష్టపడి పని చేయడం, ధనాన్ని పొదుపుగా వాడుకోవడం ఎక్కువసేపు చదవడం అన్ని పర్యాయాలు కార్యసిద్ధిని కలుగజేయవు (10:7). పొరుగింటి వెట్టివాడు లేక బుద్ధిహీనుడు లక్షాధికారికావచ్చు. నీతి మంతుని మాటలు అవినీతిపరుని మాటలకు భిన్నమైనవి. 10:12ను రోమా 3:13, 14తో పోల్చండి.

నీతి మంతుడు అనుసరించదగిన మంచి పాఠ్యాంశం 11:1లో వ్రాయబడింది. ప్రతిఫలం ఆలస్యంగా వస్తుందని మంచిని చెయ్యడానికి వెరవవద్దు. దేని గూర్చైనా ముందే ఒక అవగాహన కలిగి ఉండడం అవసరం (11:3). నీవు చేస్తున్నదేంటో తెలిసికొనేందుకు ఒక అవకాశాన్ని తీసుకో (11:6). వృద్ధునికి జీవితం అన్నది ఓ కరపత్రంలోని అంశంలా ఉండదు (11:8). యౌవ్వనం అన్నది అవకాశాలకు, సంతోషించడానికి, తీర్మానాలు చేసికోడానికి మంచి సమయం. వృద్ధుల కన్న యౌవనస్తులను ఎక్కువగా క్రీస్తువైపు త్రిప్పవచ్చు. క్రీస్తు కొరకు తీర్మానం చేసికోడానికి అది సరైన వయస్సు.

12వ అధ్యాయం 1-7 వచనాలు వృద్ధాప్యమును గూర్చిన కావ్యచిత్రం. కాని అంత అందమైనదేమి కాదు. ఆ వయస్సులో దృష్టిమాంద్యం వలన సూర్యచంద్ర నక్షత్రాదులు మసకగా కనిపిస్తాయి. కాలం దొర్లిపోతూనే ఉంటుంది. దుఃఖకరమైన అనుభవాలు ఒకదాని వెంట మరొకటి వస్తూనే ఉంటాయి. ఇంటి కావలి వారు అంటే కాళ్ళు. వృద్ధుల కాళ్ళు వణుకుతాయి. బలిష్ఠులు అంటే భుజాలు, విసరువారు అంటే దంతాలు, వీధి తలుపులు మూయబడుతున్నాయి. అంటే వినికిడిలోపం. తిరుగటి రాళ్ళధ్వని తగ్గిపోతుంది. అంటే నాలుక తడబడుతుంది. అంతకు ముందు అలారం మ్రోగితే తప్ప నిద్రలేవనివారికి ఇప్పుడు పిట్టకూసినా నిద్రాభంగం అవుతుంది. ఇక పాటలు పాడలేరు, వాయిద్యాలు వాయించలేరు. దేనికి భయపడని వారు ఇప్పుడు ఎత్తు స్థలాలను చూస్తే భయపడతారు ప్రయాణం చేయలేరు. వెండ్రుకలు నెరసిపోతాయి. చిన్న చిన్న పనులు కూడ భారంగా అనిపిస్తాయి. శృంగారం పట్ల ఆసక్తి తగ్గిపోతుంది. తుదకు మరణం ప్రాప్తిస్తుంది. వెన్నుపూసలు విడిపోతాయి, గుండె ఆగిపోతుంది. శరీరం నిద్రిస్తుంది. ఆత్మ దాని దయచేసిన దేవుని యొద్దకు వెళ్తుంది.

**II. అన్వేషణ ఫలితం (12:13, 14) :**

ఈ ముగింపు వ్యాఖ్యలో రెండు భాగాలున్నాయి.

**1. దేవుని యందలి భయభక్తులు :** సూర్యుని క్రింద చేసిన ప్రయోగాలన్నిటిలో ప్రయత్నాలన్నిటిలో దేవునికి భయపడడం ఒక్కటే తెలివైన పని. సామెతల గ్రంథంలోని సందేశం కూడ అదే. అది ఏ వయస్సులోనైనా అవసరమే. నవ్వుతూ, ప్రాకుతూ ఉండగానే బాల్యంలో సమయం ప్రాకిపోతుంది. కలలుకంటూ కబుర్లు చెప్తూ ఉ

ండగా యౌవ్వనంలో సమయం నడిచిపోతుంది. ఎదిగిన పురుషులయ్యాక సమయం పరుగెడుతుంది. ఇంకా వయస్సులో పెరుగుతూ ఉండగా సమయం ఎగిరిపోతుంది. జీవిత యాత్రలో త్వరగా సాగిపోతూ ఉండగా సమయం అయిపోతుంది. కాబట్టి "మాకు జ్ఞానహృదయము కలుగునట్లుగా చేయుము. మా దినములు లెక్కించుటకు మాకు నేర్పుము" (కీర్తన 90:12) అని ప్రార్థించాలి.

మన జీవితంలో దేనిని పోగొట్టుకోవద్దు అనుకొంటె దేవునికి భయపడాలి, ఆయన ఆజ్ఞలను గైకొనాలి. ఎందుచేతనంటే మనల్ని జీవిత పరిపూర్ణతలోనికి నడిపించేందుకే దైవిక నియమాలు రూపొందించబడ్డాయి. మనం దేవుణ్ణి కనుగొని, విశ్వసించి, ప్రతి ఒక్కటి వాక్యానుసారంగా చేయనంత వరకు పరిపూర్ణతను సాధించలేము. వాస్తవిక జీవితాన్ని కలిగిఉండలేము. ఒక వ్యక్తి దేవుని దర్శనాన్ని పొంది, ఆ దర్శనాన్ని దైనందిన జీవితానికి అన్వయించుకొంటే అది అతణ్ణి సంపూర్ణ మానవునిగా చేస్తుంది.

**2 దేవుడు ప్రతి విషయాన్ని తీర్పులోనికి తెస్తాడు :** జీవితంలో జరిగే అన్యాయా లన్నిటిని గమనించాక సొలొమోను కనుగొన్న జవాబు ఇది. దేవుడు ప్రతి ఒక్కరికి వారి వారి క్రియలను బట్టి తీర్పుతీర్చే రోజు రానున్నది. అంతంలో జరిగే తీర్పులో సంపూర్ణ న్యాయం చేకూర్చబడుతుంది. ప్రతి మనిషి పాపియే, దేవుని ఎదుట అపరాధియే గనుక దేవుడు ప్రతి ఒక్కరికీ తీర్పుతీరుస్తాడు. ఆ తీర్పును తప్పించుకోవాలనుకొంటే యేసుక్రీస్తు ద్వారా పాప క్షమాపణ పొంది జీవితాన్ని సార్థకం చేసికోవాలి. లేని పక్షంలో తీర్పుకొరకు ధవళసింహాసనం ఎదుట నిలబడాల్సి ఉంటుంది. ఈ భూమిపై జీవించే తరుణం ఉన్నప్పుడే ఆయనను గూర్చి తెలుసుకోవాలి. ఆ తీర్పులోనికి రాకుండ జాగ్రత్తపడాలి. తుది నిర్ణయం మీదే!

## The Book of Ecclesiastes

| Focus | Exploration | | | Exhortation | | |
|---|---|---|---|---|---|---|
| Divisions | All is Vanity (1–1) | Vanity of Doing (2–2) | Vanity of Having (3–6) | Vanity of Being (7–9) | Using Life Well (10–11) | Source of True Living (12–12) |
| Topics | Exploring Life's Inconsistencies | | | Explaining Life's Inconsistencies | | |
| | Fickleness of life vs. Fear of the Lord | | | | | |
| Place | Under the Sun | | | | | |
| Time | Decades of Searching (in the Days of King Solomon) | | | | | |
| Author | King Solomon | | | | | |









